





సర్టిఫికెట్లు అందజేస్తున్న కలెక్టర్ రాజర్షిషా

» కొత్త పంచాయతీల్లో తప్పని రేషన్ సరుకుల కోసం కష్టాలు
» దొడ్డు బియ్యం కోసం అష్టకష్టాలు పడుతున్న గిరిజనులు
» కొత్త షాపుల కోసం ప్రతిపాదనలు పంపినా సర్కారు నుంచి స్పందన కరువు

# రేషన్ తిప్పలు!



ఎడ్లబండిపై ప్రమాదకరంగా రేషన్ సరుకులను తరలిస్తున్న గిరిజనులు (ఫైల్)



● రేషన్ సరుకుల కోసం ఇంద్రవెల్లిలోని గౌరాపూర్‌లో ప్రమాదకరంగా వాగు దాటి వెళ్తున్న సీతాబట్ట గ్రామస్థులు



వాగు ఒడ్డున నిల్వ చేసి ఉంచిన రేషన్ బియ్యం (ఫైల్)

ఆదిలాబాద్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వం పాలనా సౌలభ్యం కోసం జిల్లాలో కొత్త గ్రామ పంచాయతీలను ఏర్పాటుచేసింది. కానీ దానికి అనుగుణంగా వసతులను కల్పించకపోవడంతో ఇప్పటికీ కొత్త పంచాయతీల్లో పాత కష్టాలే కన్పిస్తున్నాయి. ముఖ్యంగా రేషన్ సరుకుల కోసం కిలోమీటర్ల మేరకాలినడకన వెళ్తేనే కడుపునిండే పరిస్థితి ఉందని మారుమూల గిరిజన గ్రామాలప్రజలు వాపోతున్నారు. జిల్లాలో 468 గ్రామ పంచాయతీలలో తాండాలు, గూడలను కలిపి కొత్తగా 229 గ్రామ పంచాయతీలను ఏర్పాటు చేశారు. అలాగే జి ల్లా కేంద్రం పరిసర ప్రాంతాల్లోఉన్న ఐదు గ్రామ పంచాయతీలను మున్సిపాలిటీలో విలీనం చేశారు. అయితే కొత్త పంచాయతీలు ఏర్పడితే తమ బాధలు దూరమవుతాయని భావించిన మారుమూల గిరిజన గ్రామాలకు కష్టాలు తప్పడం లేదు. కొత్త పంచాయతీ ఏర్పడిందన్న సంబరమే తప్ప ఎలాంటి వసతులు, సౌకర్యాలకు నోచుకోవడం లేదంటున్నారు. జి ల్లాలో ప్రస్తుతం 355 రేషన్ దుకాణాలు ఉన్నాయి. అదనంగా మరో 112 రేషన్‌షాపుల మంజూరుకు గత మూడేళ్ల క్రితమే జిల్లా అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. జిల్లాలో ఎక్కువగా మారుమూల గిరిజన గ్రామాలే ఉన్నాయి. ఇప్పటికీ చాలామారుమూల గిరిజన గ్రామాలకు కనీసం రోడ్డు, రవాణా సౌకర్యం కూడాలేదు. వర్షాకాల సీజన్ మొదలైందంటే చాలు మారుమూల గిరిజన గ్రామాలకు వణుకు మొదలవుతుంది. కురుస్తున్నవర్షాలకు వాగులు, వంకలు పొంగి ప్రవహించడంతో ప్రమాదకరంగా ప్రయాణిస్తూ రేషన్ సరుకులను తీసుకొచ్చుకునే పరిస్థితి ఏర్పడుతుందంటున్నారు. పలుమార్లు అధికారులు, ప్రజాప్రతినిధులకు విన్నవించినా పట్టించే లేకుండా పోయిందని వాపోతున్నారు.

**● పడరాని పాట్లు**

రేషన్‌సరుకుల కోసం పడరాని పాట్లు పడితేనే సరుకులు ఇంటికి చేరే పరిస్థితి కన్పిస్తోంది. 355 రేషన్‌షాపులకు గాను ప్రస్తుతం 17 రేషన్‌షాపులు ఖాళీగా ఉన్నాయి. దీంతో ఇన్‌చార్జీ డీలర్లతోనే నెట్టుకొస్తున్నారు. అయితే ప్రతినెలా కిలోమీటర్ల మేర కాలినడకన వెళ్లి రేషన్ సరుకులను తీసుకొచ్చే పరిస్థితి ఏర్పడుతోంది. రేషన్ సరుకుల కోసమే గిరిజన పేదరైతులు రోజంతా షాపుల వద్ద పడిగాపులు కాయాల్సి వస్తోంది. అయినా అన్నీఅనుకూలిస్తేనే రేషన్ బియ్యం ఇంటికి చేరేపరిస్థితి ఉందని చెబుతున్నారు. రూపాయి దొడ్డు బియ్యం కోసం వందలు ఖర్చు చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ప్రధానంగా భీంపూర్‌లోని గొల్లఘాట్ గ్రామస్తులు తాంసి(కె)కు వెళ్లి రేషన్ బియ్యాన్ని తెచ్చుకునే పరిస్థితి ఉంది. అలాగే రాజులవాడి, కొజ్జన్‌గూడ, టేకిడి రాంపూర్ గ్రామాలకు చెందిన వారు కరంజి(టి) నుంచి, కరణ్‌వాడీ గ్రామస్థులు గోమూత్రి నుంచి, ఖైర్‌గూడ, జల్‌కోరి, గుబిడి పల్లి గ్రామాలకు చెందిన ప్రజలు అందర్‌బంద్ నుంచి ప్రతీనెల కాలినడకన వెళ్లి రేషన్‌సరుకులను తెచ్చుకుంటున్నారు. అలాగే బజార్‌హత్నూర్ మండలం కొత్తపల్లి గ్రామస్తులు ఇతర గ్రామం నుంచి రేషన్ సరుకులను తీసుకొచ్చుకుంటున్నారు. ఇలా జిల్లాలోని చాలాగ్రామాల ప్రజలు ఇప్పటికీ కిలోమీటర్లు ప్రయాణించి పాత పంచాయతీల నుంచే రేషన్ సరుకులను తీసుకుంటున్నారు.

**● గోసపడుతున్న గిరిజనులు**

ప్రతీనెల రేషన్‌సరుకుల కోసం మారుమూల గిరిజన గ్రామాలకు గోస తప్పడంలేదు. సుమారుగా 10 కి.మీల మేర కాలినడకన వెళ్లి రేషన్ సరుకులను తెచ్చుకుంటున్న పరిస్థితులు కన్పిస్తున్నాయి. కొన్నిగ్రామాల్లో అయితే కొంతమంది గ్రామస్థులు కలిసి ఎడ్లబండ్లు, ట్రాక్టర్, ఆటోలను అద్దెకు తీసుకుని రేషన్‌సరుకులను తెచ్చుకుంటున్నారు. అయితే ఎలాంటి ఆధారం లేని నిరుపేద గిరిజనులు రేషన్ బియ్యాన్ని నెత్తిన మోసుకెళ్తూ కాలినడకన ప్రయాణిస్తున్నారు. ఏజెన్సీ మారుమూల గిరిజన గ్రామాల కు కనీసం దారులు కూడా సరిగా లేకపోవడంతో ఒర్రెలు, గుట్టలు, వాగు లు దాటుతూ సరుకుల కోసం ఎన్నో అష్టకష్టాలు పడుతున్నారు. వేసవి శీతాకాలాల్లో కొంత పర్వాలేదనిపిస్తున్న వర్షాకాలంలో మాత్రం నడవలేని పరిస్థితి ఉంటుందని గిరిజనులు వాపోతున్నారు. కొందరు వర్షాకా సీజన్‌లో రేషన్‌సరుకులను తీసుకోవడం కష్టంగా మారడంతో తీసుకోవడం లేదు. వర్షాకాలం ముగిసేంత వరకు ఉన్న సరుకులతోనే సరిపెట్టుకుంటు కాలం వెళ్లదీస్తున్నారు.

**● 49 గ్రామాలకే అవకాశం**

గత ఐదేళ్లుగా కొత్తగా ఏర్పడిన గ్రామ పంచాయతీలలో రేషన్ షాపులను ఏర్పాటు చేయాలని స్థానిక ప్రజల నుంచి డిమాండ్లు వస్తున్న ప్రభుత్వం పట్టించుకోవడమే లేదంటున్నారు. జిల్లాలో ఎక్కువగా 250 నుంచి 300ల జనాభా ఉన్న తండాలు,గూడాలను కూడా గత ప్రభుత్వం హడావుగా కొత్త పంచాయతీలుగా ఏర్పాటు చేసింది. ఇలాంటి పంచాయతీల్లో 50లోపే రేషన్‌కార్డులు ఉన్నట్లు తెలుస్తోంది. కనీసం 500 వరకు రేషన్‌కార్డులు ఉంటేనే కొత్తషాపును ఏర్పాటుచేసేందుకు అవకాశం ఉంటుందని అధికారులు చెబుతున్నారు. కొత్తగా ఏర్పడిన చాలా గ్రామాల్లో 500 లోపే జనాభా ఉన్నట్లు తెలుస్తుంది. కొత్తగా ఏర్పడిన 229 గ్రామ పంచాయతీలకుగాను 49 గ్రామపంచాయతీల్లోనే రేషన్‌షాపుల ఏర్పాటుకు అవకాశంఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. దీంతో అన్ని గ్రామ పంచాయతీలలో రేషన్‌షాపులను ఏర్పాటు చేయడం కష్టమేనన్న అభిప్రాయాలున్నాయి.

### అనుమతులు రాగానే ఏర్పాటు చేస్తాం

**● కిరణ్‌కుమార్ (డీఎస్‌వో, ఆదిలాబాద్)**

జిల్లాలో కొత్తగా ఏర్పడిన గ్రామపంచాయతీల్లో రేషన్ షాపులను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. ప్రభుత్వం నుంచి అనుమతులు రాగానే చర్యలు తీసుకుంటాం. మారుమూల గిరిజన గ్రామాల్లో రేషన్ ఇబ్బందులు ఏర్పడకుండా ప్రత్యామాయంగా ఏర్పాట్లుచేస్తున్నాం. ఏమైనా ఇబ్బందులు ఉంటే ఫిర్యాదు చేయాలి. పరిశీలించి సమస్యను పరిష్కరిస్తాం.

## పరిశ్రమల స్థాపనతోనే జిల్లా ఆర్థిక ప్రగతి

**● కలెక్టర్ రాజర్షిషా**

ఆదిలాబాద్ రూరల్, ఆగస్టు1: పరిశ్రమల స్థాపనతోనే జిల్లా ఆర్థిక ప్రగతి సాధిస్తుందని, జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించాలని సంబంధిత అధికారులను కలెక్టర్ రాజర్షిషా ఆదేశించారు. గురువారం కలెక్టర్ ఛాంబర్‌లో ఇండస్ట్రియల్ అండ్ ఎక్స్‌పోర్ట్ ప్రమోషన్ కమిటీ జిల్లాస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించే దిశగా ఔత్సాహికపారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహం అందించాలని అన్నారు. ఎస్సీఎస్టీ పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించేందుకు చర్యలు చేపట్టాలని అన్నారు. సమావేశంలో జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ మాట్లాడుతూ టీజీ-ఐపాస్‌లో పెండింగ్‌లో ఉన్న అనుమతుల గురించి చర్చించారు. టీ-ప్రైడ్ స్కీం ద్వారా ఎస్సీ, ఎస్టీ ఎనిమిది మంది లబ్ధిదారులకు రూ.26.76 లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు. సమావేశంలో ఈడీ ఎస్సీ కార్పొరేషన్ ఎల్‌డీఎం, ఎంవీఐ, ఏసీటీఓ, జేడీఎం, ఏఎల్‌ఓ, ఏఈఎన్‌పీడీసీఎల్ పాల్గొన్నారు.

**● విద్యార్థులకు ఉపకార వేతనాల సర్టిఫికెట్లు అందజేత**

కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కార్యక్రమంలో భాగంగా 10వ తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన జిల్లాకు చెందిన ఇద్దరు విద్యార్థులకు ఇంటర్మీడియట్ చదువుల కోసం ఒక్కొక్కరికి రూ.15వేల చొప్పున స్కాలర్‌షిప్‌ను వారి బ్యాంకు ఖాతాలో జమచేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజర్షిషా తన ఛాంబర్‌లో కనక పూజ, మల్కాన్ నందాని అనే విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు.

## జిల్లాలో 30 పోలీస్ యాక్ట్ అమలు

ఆదిలాబాద్ రూరల్, ఆగస్టు1: శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా ఆగస్టు 31వ తేదీ వరకు ఆదిలాబాద్ జిల్లాలో 30 పోలీసు యాక్ట్ అమలులో ఉంటుందని ఎస్పీ గౌస్‌ఆలం పేర్కొన్నారు. జిల్లాపోలీసు అధికారుల ముందస్తు అనుమతి లేకుండా ధర్నాలు, రాస్తారోకోలు, నిరసనలు ర్యాలీలు, పబ్లిక్ మీటింగ్‌లు, సభలు సమావేశాలు నిర్వహించరాదని అన్నారు. నిబంధనలను ఉల్లంఘిస్తే చట్టరీత్య కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టంచేశారు.



స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

## కుప్టి ప్రాజెక్టు స్థల పరిశీలన

**● ముంపునకు గురైన వారితో మాట్లాడిన తర్వాతే పనులను ప్రారంభించాలి: నిర్వాసిత గ్రామస్థుల డిమాండ్**

నేరడిగొండ, ఆగస్టు1: కడెం పరివాహక ప్రాంతమైన కుప్టి ప్రాంతం వద్ద నిర్మించనున్న ప్రాజెక్టు స్థలాన్ని ఇరిగేషన్, రెవెన్యూ శాఖల అధికారులు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా త్వరలో కలెక్టర్ ఆ ప్రాంతాన్ని పరిశీలించనుండడంతో అధికారులు స్థలాన్ని పరిశీలించారు. కుప్టి ప్రాజెక్టుకు బడ్జెట్‌లో రూ.234 కోట్లు కేటాయించిన విషయం తెలిసిందే. స్థల పరిశీలన సమాచారం తెలుసుకున్న కుమారి, గాజిలి, గాంధారి, కుప్టి గ్రామస్థులు అధికారులతో మాట్లాడారు. ప్రాజెక్టు నిర్మాణానికి ముందే ముంపునకు గురవుతున్న 900 గృహసముదాయాలు, 2వేల ఎకరాల భూమి ముంపునకు గురవుతుందని, అన్నిసమస్యలు పరిగణలోనికి తీసుకున్న తర్వాతే ముందుకు సాగాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఇరి గేషన్ డీఈ భీంరావ్, ఏఈ జాదవ్‌ప్రకాష్, తహసీల్దార్ మహేష్, ఆర్‌ఐ నాగోరావ్ పాల్గొన్నారు.

## 'కోలాంతెగ గిరిజనులకు ఏటీడబ్ల్యుఏసీ చైర్మన్ పదవి ఇవ్వాలి'

ఉట్నూర్, ఆగస్టు1: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఉట్నూర్ ఐటీడీఏ ఆదిమ గిరిజనుల అభివృద్ధి సలహాకమిటీకమిటీ చైర్మన్ పదవిని కోలాంతెగ గిరిజనులకు ఇవ్వాలని ఆదిలాబాద్ జిల్లా కోలాం సేవా సంఘం నాయకులు, తోటి సంఘం నాయకులు ఎమ్మెల్యేబొజ్జుపటేల్‌కు విన్నవించారు. అసెంబ్లీ సమావేశాలు జరుగుతు న్నందున గురువారం హైదరాబాద్ చేరుకొని ఎమ్మెల్యే నివాసంలో ఆయనను కలిసి వినతిపత్రం అందించారు. ఐటీడీఏలో ఏటీడబ్ల్యు ఎస్సీ చైర్మన్ నామినేటెడ్ పదవిని కోలాం గిరిజనులకు ఇప్పించేలా కృషి చేయాలని కోరారు. స్పందించిన ఎమ్మెల్యే బొజ్జుపటేల్ కచ్చితంగా న్యాయం చేస్తామని హామీఇచ్చారని తెలిపారు. కార్యక్రమంలో కోలాం నాయకులు ఆత్రంభీమ్‌రావ్, టేకం భీమ్‌రావ్, నాయకులు పాల్గొన్నారు.

## బిడ్డకు తల్లి పాలే అమృతం



ర్యాలీలో బాలింతలు, కిషోర బాలికలు

సిరికొండ, ఆగస్టు 1: పుట్టినబిడ్డకు తల్లిపాలే శ్రేయస్కరమని అంగన్వాడీ టీచర్‌లు అన్నారు. గురువారం తల్లిపాల వారోత్సవాల సందర్భంగా మొదటిరోజు సిరికొండ మండలంలోని ఆయా గ్రామాల్లో అంగన్వాడీ కేంద్రాల్లో తల్లిపాలపై అవగాహన ర్యాలీలు నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్వాడీ టీచర్‌లు మాట్లాడుతూ ప్రకృతిసిద్ధంగా లభించేపాలు అమృతం లాంటివని, తల్లిపాలలో అనేక పోషకాలుంటాయని, అవిశువు పెరుగుదలకు ఉపకరిస్తాయని తెలిపారు. అనారోగ్య సమస్యలు రాకుండా ఉండాలంటే బిడ్డ పుట్టిన గంటలోపే ముర్రుపాలు ప్రతీతల్లి తప్పకుండా పట్టించాలన్నారు. ఆరునెలలపాటు శిశువుకు రోజుకు 12సార్లు తల్లిపాలు తాగించాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్‌లు రాణి, ఆశమ్మ, హంసబాయి, కౌసల్య పాల్గొన్నారు.

### సంక్షిప్త సమాచారం

**అంగన్‌వాడీ కేంద్రంలో తనిఖీలు**

తాంసి, ఆగస్టు 1: మండలంలోని పొన్నారి అంగన్‌వాడీ కేంద్రాన్ని మండల ప్రత్యేక అధికారి వెంకటరమణ, ఎంపీవో రామలింగయ్య తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎంపీవో లింగయ్య మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రంలో రికార్డులను పరిశీలించి ఆన్‌లైన్‌లో నమోదు చేసినట్లు చెప్పారు.

**'ఉద్యోగులకు బదిలీలు సహజం'**

ఉట్నూర్, ఆగస్టు1: ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీలు సహజమని ఉట్నూర్ ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బుగుప్తా అన్నారు. బుధవారం రాత్రి ఐటీడీఏ కార్యాలయం ఆవరణలోని సమావేశ మందిరంలో నిర్వహించిన డీడీ దిలీప్‌కుమార్ బదిలీ వీడ్కోలు సమావేశంలో ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఐటీడీఏ కార్యాలయంలో తమ హోదావారీగా విధులకు దిలీప్‌కుమార్ న్యాయం చేశారని కొనియాడారు. ఈ సందర్భంగా దిలీప్‌కుమార్‌ను సన్మానించారు. కార్యక్రమంలో అదనపు వైద్యజిల్లా అధికారి డాక్టర్ కుడిమెత మనోహర్, ఆసిఫాబాద్ డీడీ రమాదేవి, ఏసీఎంఓ జగన్, జిల్లా క్రీడల అధికారి పార్థసారథి, ప్రిన్సిపల్ మేస్రం మనోహర్, అధికారులు, ప్రధానోపాధ్యాయులున్నారు.

**పరిసరాల శుభ్రతపై అవగాహన**

తలమడుగు, ఆగస్టు1: మండల పరిధిలోని సోనుగూడ, లక్ష్మీపూర్, మర్రిగూడలలో పరిసరాల పరిశుభ్రత అవగహన కల్పించారు. ఈ సందర్భంగా ఆదివాసి సకల కళా సంక్షేమ సంఘం డైరెక్టర్ ప్రముఖ ఆదివాసి కళాకారుడు కాత్లేశ్రీధర్ మాట్లాడుతూ గురువారం ఉట్నూర్ ఐటీడీఏ పీవో, డీఎంఅండ్‌హెచ్‌ఓ ఆదేశాల మేరకు ఆదివాసి సకలకళా సంక్షేమ సంఘం, ఐటీడీఏ సంయుక్త ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆదివాసీ సకలకళాసంక్షేమ సంఘం డైరెక్టర్ ప్రముఖ ఆదివాసీ కళాకారుడు కాత్లే శ్రీధర్, కార్యదర్శి ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.

**పరిసరాల శుభ్రతతోనే ఆరోగ్యం**

బోథ్, ఆగస్టు1: పరిసరాల శుభ్రతతోనే వ్యాధులు దరిచేరవని వైద్యసిబ్బంది పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలోని 8, 9వ వార్డుల్లో పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. నిలువ నీటితో దోమలు పెరుగుతాయని దోమలు పెరగకుండా చూసుకోవాలని, ఇంటిచుట్టూ నీటినిల్వ లేకుండా చూడాలని వివరించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ అనూష, ఏఎన్‌ఎం సుమంగళ, స్నేహ, ఆశావర్కర్ ప్రమీళలు పాల్గొన్నారు.

**దివ్యాంగులకు బస్ పాస్‌ల జారీ**

బోథ్, ఆగస్టు1: మండల కేంద్రంలోని బస్టాండ్‌లో ఆర్టీసీ అధికారులు గురువారం దివ్యాంగులకు బస్ పాస్‌లు జారీచేశారు. కార్యక్రమంలో కంట్రోలర్ మల్లెపూల సుదర్శన్, సిబ్బంది సర్వేజ్, షేక్ మహబూబ్, రాజేశ్వర్, నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

**వివేకానంద యూత్ కార్యవర్గం ఏర్పాటు**

బోథ్, ఆగస్టు1: సోనాల మండలకేంద్రంలో వివేకానంద యూత్ కార్యవర్గాన్ని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా అభిలాష్, ఉపాధ్యక్షుడిగా దండారి రాజు, కోశాధికారిగా వినీత్, నిఖిల్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

**డీఈఈసీఈటీ వెరిఫికేషన్ ప్రారంభం**

ఆదిలాబాద్ రూరల్, ఆగస్టు 1: డీఈఈసీఈటీ-2024లో ర్యాంక్‌సాధించిన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అభ్యర్థులకు డీఎడ్‌లో ప్రవేశం కోసం ఆదిలాబాద్ డైట్ కళాశాలలో సర్టిఫికెట్ వెరిఫికేషన్ ప్రక్రియ ప్రారంభమైంది.

## మహిళలను అవమానించడం సిగ్గుచేటు

**● సీఎం క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తూ పలుచోట్ల దిష్టిబొమ్మ దహనం**



తాంసిలో దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

తలమడుగు, ఆగస్టు1: బీఆర్‌ఎస్ పార్టీ మహిళా ఎమ్మెల్యేలను అసెంబ్లీలో అవమానపర్చిన సీఎం రేవంత్‌రెడ్డి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తూ గురువారం బీ ఆర్‌ఎస్ పార్టీ నాయకులు పలుచోట్ల ఆందోళన చేపట్టారు. బీఆర్‌ఎస్ తలమడుగు మండల కన్వీనర్ తోట వెంకటేష్ మాట్లాడుతూ చట్టసభలో మహిళలను గౌరవించాల్సింది పోయి స్వార్థ రాజకీయాల కోసం మహిళలను కించపరిచేలా అవమానించడం సిగ్గుచేటని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్‌చేశారు. బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్, ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ ఆదేశాల మేరకు అంతర్రాష్ట్ర రహదారిపై రాస్తారోకోచేసి సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ అధికార ప్రతినిధి కిరణ్‌కుమార్, ఉపాధ్యక్షుడు మగ్గిడి ప్రకాష్, అబ్దుల్లా, వామన్, ప్రసన్‌రెడ్డి, సీనియర్ నాయకులు సుదర్శన్‌రెడ్డి, ప్రకాష్ రెడ్డి, మాజీ సర్పంచ్ కొచ్చన్న, రమాకాంత్ , పల్లవి రాంబాయి, ప్రమోద్, జనార్దన్, దేవరావు, తదితరులు పాల్గొన్నారు.

నేరడిగొండ: హామీలు నేరవేర్చకుండా సభను పక్కదోవ పట్టించేలా మహిళలను కించపర్చేలా వ్యవహరించిన సీఎం తీరును నిరసిస్తూ నేరడిగొండ మండలకేంద్రంలో మాజీ ఎంపీపీ రాథోడ్ సజన్ ఆధ్వర్యంలో సీఎం దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు శివారెడ్డి, నాయకులు విశాల్‌దాస్, దేవేందర్‌రెడ్డి. జాహిర్, పోశెట్టి, మహేందర్‌రెడ్డి, నారాయణ, సురేందర్, సుజిల్, సద్దాం, తదితరులు పాల్గొన్నారు.

సిరికొండ: మహిళా ఎమ్మెల్యేలను అవమానపర్చేలా సీఎం రేవంత్‌రెడ్డి తీరును ఖండిస్తూ గాంధీచౌక్ వద్ద సిరికొండ మండల బీఆర్‌ఎస్ పార్టీ శ్రేణులు సీఎం దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు ఒరగంటి పెంటన్న, రోహిదాస్, మల్లేష్, రాజు, మారుతి, గణేష్, సాయన్న, తదితరులు పాల్గొన్నారు.

బోథ్: మహిళలను కించపర్చుతూ మాట్లాడడం సిగ్గుచేటని మండల మాజీ అధ్యక్షుడు శ్రీనివాస్ పేర్కొన్నారు. గురువారం మండలకేంద్రంలోని బస్టాండ్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు నారాయణరెడ్డి, మాజీ సర్పంచ్ సురేందర్ యాదవ్, శ్రీధర్‌రెడ్డి, ఆత్మ మాజీ చైర్మన్ మల్లెపూల సుభాష్, నాయకులు ఎలక రాజు, నరేందర్, ప్రవీణ్‌తోపాటు పలు గ్రామాల మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, తదితరులు పాల్గొన్నారు.

తాంసి: తాంసిలో బీఆర్‌ఎస్ నాయకులు సీఎం దిష్టిబొమ్మను గురువార దహనం చేశారు. అసెంబ్లీలో మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి పట్ల సీఎం అవమానకరంగా మాట్లాడడం సిగ్గుచేటని అన్నారు. దీనికి నిరసనగా మండల కేంద్రంలో సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేసినట్లు నాయకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల నాయకులు రమణ, టాక్రే గంగారాం, తులసీరామ్, అశోక్ తదితరులు ఉన్నారు.

## ఏపీవో జనరల్‌గా వసంత్ బాధ్యతల స్వీకరణ

ఉట్నూర్, ఆగస్టు1: ఉమ్మడి జిల్లాలోని ఉట్నూర్ సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ (ఐటీడీఏ) సహాయ ప్రాజెక్టు అధికారి (జనరల్)గా జాదవ్ వసంత్ నాయక్ బాధ్యతలు స్వీకరించారు. ముందుగా ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బుగుప్తాను కలిసి మర్యాదపూర్వంగా పుష్పగుచ్ఛం అందించారు. కార్యాలయ సిబ్బంది, నాలుగో తరగతి ఉద్యోగుల సైతం ఏపీవో వసంత్‌కు పుష్పగుచ్ఛం అందించారు. కార్యక్రమంలో ఉద్యోగులు విజయ్, శ్యామల పాల్గొన్నారు.

**'నైట్‌వాచ్ ఉమెన్ పోస్టుకు దరఖాస్తు చేసుకోండి'**

గుడిహత్నూర్, ఆగస్టు1: మండలంలోని పునగూడ కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలలో ఖాళీగా ఉన్న నైట్‌వాచ్ ఉమెన్ పోస్టుకు మహిళా అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలని ఎంఈవో నారాయణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పదవ తరగతి పాసై 25 నుంచి 55 ఏళ్ల ఉన్న మహిళలు ఈనెల 3వ తేది వరకు సాయంత్రం 4 గంటలలోపు ఎంఈవో కార్యాలయంలో దరఖాస్తులు అందించాలని పేర్కొన్నారు.

## ఐటీఐ కళాశాలను సందర్శించిన ట్రైనీ కలెక్టర్



విద్యార్థులతో మాట్లాడుతున్న ట్రైనీ కలెక్టర్

మావల, ఆగస్టు1: ఐటీఐ కళాశాలను సందర్శించిన ట్రైనీ కలెక్టర్ అభిజ్ఞాన్ మాలవీయ గురువారం సందర్శించారు. ఈ మేరకు ఐటీఐ క్యాడర్ సంఖ్య, ఖాళీల వివరాలు, అడ్మిషన్స్, పరీక్ష విధానం, పీఎం విశ్వకర్మ, డ్రాప్ ఔట్స్ రేట్స్, పరిశ్రమల కనెక్టివిటీ, ట్రైనీలకు ప్లేస్మెంట్ అప్రెంటిస్ గురించి ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌ను అడిగి వివరాలు తెలుసుకున్నారు. అదే విధంగా రిజిస్టర్‌లను పరిశీలించి సంతృప్తి వ్యక్తంచేశారు.

## హెచ్‌ఎం, డాక్టర్‌లకు షోకాజ్ నోటీసులు

**● ఆశ్రమ పాఠశాల నిర్వహణపై ఐటీడీఏ పీవో ఖుష్బు గుప్తా ఆగ్రహం**
**● పిట్టబొంగరంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ఆశ్రమ పాఠశాలల ఆకస్మికంగా తనిఖీ**



రికార్డులను పరిశీలిస్తున్న ఐటీడీఏ పీవో

**అనుమతి లేకుండా సెలవు పెట్టిన ఓ మెడికల్ ఆఫీసర్‌కు, మధ్యాహ్న భోజనంలో మెనూ పాటించని ఆశ్రమ పాఠశాల హెచ్‌ఎంకు ఐటీడీఏ పీవో ఖుష్బు గుప్తా షోకాజ్ నోటీసు జారీ చేశారు.**

ఇంద్రవెల్లి, ఆగస్టు1: మండలంలోని పిట్టబొంగరం గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంతోపాటు గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాలను ఐటీడీఏ పీవో ఖుష్బు గుప్తా ఆకస్మికంగా తనిఖీచేశారు. ముందుగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యులు, సిబ్బంది హాజరును పరిశీలించారు. ఎలాంటి అనుమతి లేకుండా సెలవు పెట్టడంపై మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ప్రతాప్ నాయక్‌కు షోకాజ్ నోటీసు జారీచేశారు. అనంతరం ఆశ్రమపాఠశాలలో వసతులు ఎలా ఉన్నాయో పరిశీలించారు. ప్రభుత్వం నుంచి విద్యార్థులకు అందే నోట్ పుస్తకాలు, యూనిఫాం దుస్తుల పంపిణీ చేశారా లేదా అని దానిపై ఆరాతీశారు. ఉపాధ్యాయులు సబ్జెక్టుల వారీగా విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేయాలని సూచించారు. తరగతి గదిలో బోర్డుపై రోజువారి విద్యార్థుల హాజరు, గైర్హాజరు నమోదు ఉండాలని సూచించారు. పదో తరగతి గదిలో విద్యార్థులకు పాఠాలు బోధించారు. సబ్జెక్టుల వారీగా ప్రశ్నలు అడిగి తెలుసుకున్నారు. ప్రతి విద్యార్థికి చదవడం, రాయడం తప్పనిసరిగా రావాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం ఉపాధ్యాయుల అటెండెన్స్, స్టాక్ రిజిస్టర్లను పరిశీలించారు. తరగతి గదిలో వంట గదిలో నీరు నిల్వ ఉండటం భోజనం మెనూ పాటించకపోవడం రిజిస్ట్రార్‌లో హాజర్లు వేయకపోవడం ఉపాధ్యాయులు సమయం పాటించకపోవడంపై ఆగ్రహించి పిట్టబొంగరం ప్రధానోపాధ్యాయులు సిడాం లాల్ సాట్‌కి షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఈ సందర్భంగా ఐటీడీఏ పీవో ఖుష్బుగుప్తా మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటు ప్రతీరోజుమెనూ ప్రకారం పోషకవిలువలు గల ఆహారాన్ని అందించాలన్నారు. నిత్యం పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ప్రతీరోజు వంట గది, స్టోర్‌రూమ్, తాగునీరు, మరుగుదొడ్లు శుభ్రంగా ఉండేలా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వర్షాల నేపథ్యంలో దోమల వల్ల వ్యాపించే డెంగ్యూ మలేరియా వంటి వ్యాధులు ప్రభలకుండా వసతి గృహ పరిసరాలలో వర్షపునీరు నిలువకుండా చూడాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ మంత్రి జోగు రామన్న

## మహిళా సమాజానికి క్షమాపణ చెప్పాలి

● సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం

ఆదిలాబాద్ రూరల్, ఆగస్టు1: సీఎం రేవంత్‌రెడ్డి బీఆర్‌ఎస్ మహిళా ఎమ్మెల్యేల పట్ల అనుచిత వ్యాఖ్యలు చేశారని ఆరోపిస్తున్న బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళనకు దిగారు. గురువారం పట్టణ బీఆర్‌ఎస్ కార్యాలయం నుంచి డప్పు చప్పుళ్ల మధ్య ఫ్లకార్డులను పట్టుకొని కొమురంభీం చౌక్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి జోగు రామన్న మాట్లాడుతూ అధికారం, అహంకారంతో రేవంత్‌రెడ్డి మాట్లాడారని అన్నారు. కార్యక్రమంలో మహిళలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



రైల్వేస్టేషన్‌ను పరిశీలిస్తున్న డీఐజీ

## ఆదిలాబాద్ ఆర్పీఎఫ్ స్టేషన్ తనిఖీ

ఆదిలాబాద్ రూరల్, ఆగస్టు 1: ఆదిలాబాద్ రైల్వే స్టేషన్‌లోని ఆర్పీఎఫ్ స్టేషన్‌ను డీఐజీ ఎండీ షాదాన్ జెబ్ ఖాన్ గురువారం తనిఖీ చేశారు. తనిఖీల్లో భాగంగా స్టేషన్‌లోని రికార్డులను పరిశీలించారు. స్టేషన్ సిబ్బంది పనితీరును ఆయన సమీక్షించారు. సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యల గురించి వారిని అడిగి తెలుసుకున్నారు. అంతకు ముందు ఎస్పీ గౌస్‌ఆలం డీఐజీని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు.

## తప్పుడు ప్రచారం చేస్తే సహించేది లేదు : కంది

ఆదిలాబాద్, ఆగస్టు1 (ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ ప్రజలకు సేవ చేయాలనే తపనతో రాజకీయాల్లోకి వచ్చిన తనపై తప్పుడు ప్రచారం చేస్తే సహించేది లేదని కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ కంది శ్రీనివాస్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కొందరు తనపై రాజకీయ కక్షకట్టి కంపెనీ వ్యాపారాలను దెబ్బతీసే కుట్ర చేస్తున్నారని ఈ సందర్భంగా ఆరోపించారు. చట్టప్రకారం జరిగే వ్యాపారంపై దుష్ప్రచారం చేస్తే ఎంతో మంది ఉపాధిని కోల్పోయే ప్రమాదం ఉంటుందన్నారు. అన్నిరకాల ప్రభుత్వ అనుమతులు తీసుకున్న తర్వాతే న్యాయబద్ధంగా ప్రభుత్వ నియమనిబంధనలకు లోబడి వ్యాపారం చేయడం చేస్తున్నట్లు పేర్కొన్నారు. తనను రాజకీయంగా ఎదుర్కోలేకనే తన ఐటీ కంపెనీల మీద పనిగట్టుకుని తప్పుడు ప్రచారం చేస్తున్నారని తెలిపారు. తన ప్రతిష్ఠను దెబ్బతీసే విధంగా సోషల్‌మీడియాలో పోస్టులు చేస్తున్నవారిపై చట్టపరమైన చర్యలు తీసుకునేందుకు న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని పేర్కొన్నారు. దీనిపై సైబర్ పోలీసు విభాగానికి ఫిర్యాదు చేస్తామని తెలిపారు. తన ఎదుగుదలను ఓర్వలేకనే కొందరు నేతలు తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని, ఎవరు ఏమిటో ఆదిలాబాద్ ప్రజలకు తెలుసని పేర్కొన్నారు.

## ఆగస్టు, సెప్టెంబరులోనూ జోరు వానలు!

» భారత వాతావరణ శాఖ అంచనా

విశాఖపట్నం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): నైరుతి రుతుపవనాల సీజన్‌లో తొలి అర్థభాగం మంచి వర్షాలు కురిశాయి. అదేజోరు ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో కొనసాగనుంది. రెండు నెలల్లో దేశంలోని అనేక ప్రాంతాల్లో సాధారణం, అంతకంటే ఎక్కువ వర్షపాతం (దీర్ఘకాలిక సగటులో 106 శాతం) నమోదవుతుంది. అయితే ఈశాన్య రాష్ట్రాలు, తూర్పు భారతంలో కొన్ని ప్రాంతాలు, సౌరాష్ట్ర, లద్దాక్, మధ్య, దక్షిణ భారతంలో కొన్ని ప్రాంతాల్లో సాధారణం, అంతకంటే తక్కువ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అంచనా వేసింది. ఆగస్టు నెలలో ఈశాన్య రాష్ట్రాలు, వాయవ్య, మధ్య, తూర్పు, దక్షిణాదిలో పలు భాగాలు, కశ్మీర్, లద్దాక్ వంటి ప్రాంతాలు తప్ప దేశంలో మిగిలిన ప్రాంతాల్లో సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం నమోదవుతుంది. ఈ మేరకు ఆగస్టు, సెప్టెంబరు నెలలకు సంబంధించి ముందస్తు అంచనా నివేదికను వాతావరణ శాఖ గురువారం విడుదల చేసింది.

ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో దేశంలో 422.8 మి.మీ వర్షపాతం (1971 నుంచి 2020 వరకు నమోదైన వర్షపాతం సగటులో 106 శాతం) నమోదవుతుందని తాజా బులెటిన్‌లో పేర్కొంది. ఆగస్టులో దేశంలో 254.9 మి.మీ. (1971 నుంచి 2020 వరకు నమోదైన వర్షపాతం సగటులో 94 నుంచి 106 శాతం వరకు) నమోదు కానుంది. ఆగస్టులో దక్షిణాది రాష్ట్రాల్లో తప్ప దేశంలోని అనేక ప్రాంతాల్లో గరిష్ఠ, కనిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణం కంటే ఎక్కువగా నమోదవుతాయని తెలిపింది. కాగా, ఆగస్టులో దక్షిణ కోస్తా, సీమల్లో ఎక్కువ, ఉత్తర కోస్తాలో తక్కువ వర్షాలు ఆగస్టు నెలలో దక్షిణ కోస్తా, రాయలసీమల్లో సాధారణం, అంతకంటే ఎక్కువ వర్షాలు కురవనున్నాయి. ఉత్తర కోస్తాలోని ఎక్కువ ప్రాంతాల్లో సాధారణం, అంతకంటే తక్కువ వర్షాలు కురుస్తాయి. ఉత్తర తెలంగాణ, ఉత్తర కోస్తాలతోపాటు, దక్షిణ ఛత్తీస్‌గఢ్‌లో సాధారణం కంటే తక్కువ వర్షాలు కురవనున్నాయని వాతావరణ శాఖ అంచనా వేసింది.

# ఇది జాతీయ విపత్తే

## మా నాన్నను కోల్పోయినప్పటి పరిస్థితి గుర్తుకొచ్చింది: రాహుల్‌గాంధీ

» సోదరి ప్రియాంకతో కలిసి..

ముండక్కై, చురాల్‌మలలో పర్యటన

» జాతీయ విపత్తుగా ప్రకటించాలి: పినరయి

» 289కి పెరిగిన మరణాలు



పునరావాస శిబిరంలో బాధితులను ఓదారుస్తున్న రాహుల్, ప్రియాంక

వయనాడ్, ఆగస్టు 1: "వయనాడ్‌లో తీవ్ర విషాదం నెలకొంది. ఆ దృశ్యాలు హృదయాన్ని తీవ్రంగా గాయపరుస్తున్నాయి. నాకు ఏం చెప్పాలో తెలియడం లేదు. మా నాన్న చనిపోయినప్పుడు ఎలా ఉండేదో.. ఇప్పుడు అలాంటి బాధనే ఎదుర్కొంటున్నాను. నా దృష్టిలో ఇది జాతీయ విపత్తే" అని లోక్‌సభలో విపక్ష నేత, కాంగ్రెస్ అగ్రనాయకుడు రాహుల్‌గాంధీ ఉద్వేగంతో అన్నారు. గురువారం ఆయన తన సోదరి ప్రియాంక గాంధీతో కలిసి వయనాడ్‌లో కొండచరియల బాధిత ప్రాంతాలు-- ముండక్కై, చురాల్‌మల, అట్టమల, మెప్పాడిలో పర్యటించారు. ఈ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన పునరావాస శిబిరాల్లో, ఆస్పత్రుల్లో బాధితులతో మాట్లాడారు. "దేశం మీ వెన్నంటే ఉంది.." అంటూ వారికి ధైర్యం చెప్పారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. ఇది బాధాకరమైన పరిస్థితి అని.. పినరయి ప్రభుత్వం బాధితులకు అన్ని విధాలా సాయం చేయడానికి కట్టుబడి ఉందని చెప్పారు. ముందే హెచ్చరించామంటూ లోక్‌సభలో హోంమంత్రి అమిత్‌షా చేసిన ప్రకటన గురించి విలేకరులు ప్రస్తావించగా.. "ఇది రాజకీయ ఘర్షణకు సమయం కాదు. అన్ని వ్యవస్థలు కలిసికట్టుగా పనిచేయాల్సిన తరుణమిది" అని వ్యాఖ్యానించారు. కరోనా కష్టకాలంలో తాను, ప్రియాంక వయనాడ్ ప్రజలకు అండగా ఉన్న విషయాన్ని గుర్తు చేస్తూ.. ఇప్పుడు కూడా సహాయక చర్యలు, పునరావాస కార్యక్రమాలను నిశితంగా పర్యవేక్షిస్తున్నామని చెప్పారు. అనంతరం ఇదే విషయాన్ని తన ఎక్స్, ఫేస్‌బుక్ ఖాతాల్లో పోస్ట్ చేశారు. మరోవైపు కేరళ సీఎం పినరయి విజయన్ కూడా వయనాడ్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 280కి పైగా పౌరులు చనిపోయారని, కేంద్రం జాతీయ విపత్తుగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. జాతీయ విపత్తుగా ప్రకటించడానికి అభ్యంతరం ఏంటని ప్రశ్నించారు. సహాయక చర్యల్లో పాల్గొంటున్న సైన్యం, రెస్క్యూ వర్కర్లు, స్థానికులను ఆయన అభినందించారు. ఆర్మీ జాగిలాలు మృతదేహాలను గుర్తిస్తున్నాయని, నదిలో కొట్టుకుపోయిన శరీర భాగాలను వెలికి తీసే ప్రయత్నాలు జరుగుతున్నాయని చెప్పారు. కాగా.. కొండచరియలు విరిగిపడ్డ ఘటనల్లో మృతుల సంఖ్య 289కి పెరిగినట్లు అధికారులు వివరించారు. గల్లంతైన వారి ఆచూకీ తెలుసుకునేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆయన తెలిపారు.

### డార్క్ టూరిజం వద్దు

వయనాడ్‌లో డార్క్ టూరిజానికి రావొద్దంటూ కేరళ పోలీసులు సామాజిక మాధ్యమాల్లో విజ్ఞప్తి చేశారు. దీంతో.. 'డార్క్ టూరిజం' అనే పదం వైరల్‌గా మారింది. 'చెర్నోబిల్ అండ్ ది డార్క్ టూరిస్ట్' టీవీ షోతో ఈ పదం బాగా పాపులర్ అయింది. మరణం, విషాదం, హింస చోటుచేసుకుని, అసాధారణ పరిస్థితులు ఉండే ప్రదేశాలను సందర్శించడాన్ని డార్క్ టూరిజం అంటారు. ఉదాహరణకు ఉక్రెయిన్‌లోని చెర్నోబిల్ (అణు విద్యుత్తు కేంద్రం) ఘటన, కాంబోడియాలో కిల్లింగ్ ఫీల్డ్స్, పోలెండ్‌లోని అష్విట్జ్ క్యాంప్ వంటివి డార్క్ టూరిజం కిందకు వస్తాయి. ఇప్పుడు వయనాడ్‌కు డార్క్ టూరిస్టులు వస్తే.. సహాయక చర్యలకు ఆటంకాలేర్పడతాయని కేరళ పోలీసులు ఆందోళన వ్యక్తం చేశారు.

## హమాస్‌కు భారీ దెబ్బ!

» ఇజ్రాయెల్‌పై దాడుల వ్యూహకర్త మిలిటరీ చీఫ్ డెయిఫ్ హతం!

» జూలై 13న గాజాలో అంతం చేశాం

» ప్రకటించిన ఇజ్రాయెల్ సైన్యం

» ఆ ప్రకటనను ఖండించిన హమాస్

జెరూసలెం, ఆగస్టు 1: హమాస్‌కు మరో భారీ దెబ్బ తగిలింది. ఇరాన్ రక్షణలో ఉన్న హమాస్ చీఫ్ ఇస్మాయిల్ హనియా హత్యకు గురైన మరునాడే హమాస్ మిలిటరీ చీఫ్, ఇజ్రాయెల్‌పై దాడుల వ్యూహకర్త మహమ్మద్ డెయిఫ్ హతమయ్యాడు. డెయిఫ్‌ను తమ సైన్యం అంతం చేసినట్టు ఇజ్రాయెల్ గురువారం అధికారికంగా ప్రకటించింది. తన ప్రకటనలో ఆపరేషన్ వివరాలను వెల్లడించింది. "మా సైన్యం (ఐడీఎఫ్) గత నెల 13న గాజాలోని ఖాన్ యూనిస్ ప్రాంతంపై జెట్లతో దాడి చేసింది. అక్కడ హమాస్‌కు చెందిన డిప్యూటీ కమాండరు నివాసంలో డెయిఫ్ ఉన్నట్టు గుర్తించాం. అక్కడ జెట్లతో బాంబులు ప్రయోగించాం. ఈ దాడిలో డెయిఫ్ హతమయ్యాడు" అని ఆ ప్రకటనలో తెలిపింది. గత ఏడాది అక్టోబరు ఏడున ఇజ్రాయెల్ భూభాగంపై జరిగిన దాడుల ఆలోచన, ప్రణాళిక, అమలు అంతా డెయిఫ్ నేతృత్వంలో జరిగిందని ఇజ్రాయెల్ ఆరోపిస్తోంది. ఈ దాడుల్లో 1197 మంది ఇజ్రాయెల్ పౌరులు చనిపోయారు. కాగా, డెయిఫ్ మరణవార్తపై హమాస్ స్పందించింది. ఖాన్ యూనిస్‌పై జూలైలో ఇజ్రాయెల్ దాడులు చేసిన మాట నిజమేనని, అందులో 90మంది చనిపోయారని, మృతుల్లో డెయిఫ్ లేరని గాజాలోని హమాస్‌కు చెందిన ఆరోగ్య వర్గాలు ధ్రువీకరించాయి.



## కర్ణాటక సీఎంకు గవర్నర్ నోటీసుపై మంత్రివర్గం అభ్యంతరం

» వెనక్కి తీసుకోవాలని ఏకగ్రీవ తీర్మానం

బెంగళూరు, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): మైసూరు నగరాభివృద్ధి ప్రాధికార(ముడా) ఇంటి స్థలాల కేటాయింపు అవినీతి వ్యవహారంలో కర్ణాటక ముఖ్యమంత్రి సిద్దరామయ్యకు గవర్నర్ థావర్ చంద్ గెహ్లోట్ నోటీసులు జారీ చేయడంపై మంత్రి వర్గం తీవ్ర అభ్యంతరం తెలిపింది. విధానసౌధలో గురువారం సీఎం సిద్దరామయ్య లేకుండా డీసీఎం డీకే శివకుమార్ అధ్యక్షతన క్యాబినెట్ భేటీ జరిగింది. ముడా అవినీతికి సంబంధించి గవర్నర్ జారీ చేసిన నోటీసులు వాపసు తీసుకోవాలని క్యాబినెట్‌లో ఏకగ్రీవంగా తీర్మానించారు. ఈ విషయాన్ని సహకార శాఖ మంత్రి రాజణ్ణ మీడియాకు తెలిపారు. సీఎం సిద్దరామయ్యకు రాజభవన్ నుంచి వచ్చి న షోకాజ్ నోటీసు గురించి చర్చించామని, న్యాయపోరాటం చేయాలని తీర్మానించామని చెప్పారు. గవర్నర్ జారీ చేసిన నోటీసును వాపసు తీసుకోవాలని క్యాబినెట్‌లో తీర్మానించామని పేర్కొన్నారు. ముఖ్యమంత్రికి గవర్నర్ నోటీసు జారీ చేయడం రాజకీయ ప్రేరేపితమని ఆరోపించారు. నోటీసులు తిరస్కరించాలని నిర్ణయం తీసుకున్నామని ఆయన తెలిపారు.

# ఉత్తరాది అతలాకుతలం

(మొదటి పేజీ తరువాయి)





వర్షాలకు హిమాచల్‌ప్రదేశ్‌లోని మనాలీలో ధ్వంసమైన రోడ్డు

కోల్పోయారు. కులు జిల్లాలో ఏడుగురు కొట్టుకుపోయారు. మలానా జల విద్యుత్ కేంద్రంలో పలువురు చిక్కుకుపోయారు. బియాస్ నది ఉధృతి, కొండచరియలు విరిగిపడడంతో కీలకమైన మనాలీ-చండీగఢ్ జాతీయ రహదారి పలుచోట్ల తీవ్రంగా దెబ్బతిన్నది. హిమాచల్ సీఎం సుఖుకు కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఫోన్ చేసి పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. కాగా, రాష్ట్రంలోని పాలంపూర్, చౌరీలో 21 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. ధర్మశాల (18 సెం.మీ.) సహా పలు ప్రాంతాల్లో 10కి పైగా సెం.మీ. వర్షం పడింది. కంగ్రా, కులు, మండిలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే ప్రమాదం ఉందని వాతావరణ శాఖ రెడ్ అలర్ట్ జారీ చేసింది. ఉత్తరాఖండ్‌లో భారీ వర్షాలతో రాత్రికి రాత్రే వరద పోటెత్తింది. పలు నదులు ప్రమాదకర స్థాయిని దాటి ప్రవహిస్తున్నాయి. డెహ్రాడూన్‌లో పరిస్థితి తీవ్రంగా ఉంది. రాష్ట్రంలో మొత్తం 12 మంది మృతిచెందారు. హరిద్వార్‌లోనే ఆరుగురు చనిపోయారు. ఇక్కడ 21 సెం.మీ. వర్షపాతం నమోదైంది. చాలాచోట్ల 10 సెం.మీ. పైన వాన పడింది. కేదార్‌నాథ్ మార్గంలో 1,500 మంది యాత్రికులు చిక్కుకుపోయారు. వీరిలో 425 మందిని హెలికాప్టర్ ద్వారా సురక్షిత ప్రాంతాలకు తరలించారు. ఉత్తరాఖండ్, హిమాచల్‌లో ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్, సైన్యం, స్థానిక పోలీసులు సహాయక చర్యలు చేపట్టారు. దేశ రాజధాని ఢిల్లీలోని చాలా ప్రాంతాలు ఇంకా నీటిలోనే ఉన్నాయి. ఆరుచోట్ల ఒక్క రోజులోనే 10 సెం.మీ.పైగా వర్షపాతం నమోదైంది. వివిధ ఘటనల్లో ఐదుగురు చనిపోయినట్లు అధికారులు తెలిపారు. 12 ఏళ్ల బాలుడు, 26 ఏళ్ల యువకుడు విద్యుదాఘాతంతో ప్రాణాలు కోల్పోయారు. మరోవైపు రాజస్థాన్ రాజధాని జైపూర్‌ను వర్షాలు ముంచెత్తాయి. ఓ ఇంట్లోకి వరద చేరడంతో ఆరేళ్ల బాలిక సహా ముగ్గురు మృతిచెందారు. హిమాచల్, పంజాబ్, హరియాణా, ఢిల్లీ, ఉత్తరాఖండ్, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, కర్ణాటక, ఉత్తరప్రదేశ్, గోవాలకు వాతావరణ శాఖ ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది.

# పార్లమెంట్ పైకప్పు లీకేజీ

» బీజేపీ ప్రభుత్వంపై ప్రతిపక్షాల మండిపాటు

» లీకేజీ స్వల్పమే.. పరిష్కరించాం: కేంద్రం



న్యూఢిల్లీ, ఆగస్టు 1: ఢిల్లీలో కురుస్తున్న భారీ వర్షాలకు కొత్త పార్లమెంటు భవనం పైకప్పు లీకవుతోంది. రూ.1,000 కోట్లకు పైగా ఖర్చు చేసి నిర్మించిన ఈ భవనం లాబీలోని గాజు పైకప్పు నుంచి కింద ఉంచిన బకెట్‌లోకి నీరు ధారగా పడుతున్న వీడియోను సమాజ్‌వాదీ పార్టీ చీఫ్ అఖిలేశ్ యాదవ్ సామాజిక మాధ్యమాల్లో షేర్ చేశారు. "కొత్త భవనం కంటే పాత భవనం చాలా మెరుగ్గా ఉంది. వర్షాకాల సమావేశాలను పాతదానిలో ఎందుకు నిర్వహించకూడదు. కనీసం కొత్తదానిలో నీరు కారడం ఆగిపోయే వరకైనా..' అంటూ వ్యంగాస్త్రాలు సంధించారు. ఈ ప్రభుత్వ హయాంలో నిర్మించిన ప్రతి కొత్త భవనం పైకప్పు నుంచి నీరు లీకవడం.. బాగా ఆలోచించి రూపొందించిన డిజైన్‌లో భాగమా అని ప్రజలు అడుగుతున్నారని ఆయన బీజేపీ ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. ఈ వీడియోపై కాంగ్రెస్ ఎంపీ మాణిక్యం ఠాగూర్ స్పందించారు. "బయట పేపర్ లీక్.. లోపల వాటర్ లీక్.. నిర్మించిన ఏడాది పూర్తి కాకుండానే పార్లమెంట్ లాబీలో నీరు లీక్ కావడం కొత్త భవనంలో అత్యవసర పునరుద్ధరణ సమస్యలను ఎత్తి చూపుతోంది" అని ఎద్దేవా చేశారు. ఈ అంశంపై చర్చించడానికి ప్రస్తుత లోక్‌సభ సమావేశాల్లో ఆయన వాయిదా తీర్మానం ప్రవేశపెట్టారు. 'రూ.1,200 కోట్ల వ్యయంతో నిర్మించిన పార్లమెంట్ ఇప్పుడు రూ.120 బకెట్‌పై ఆధారపడి ఉంది' అని ఆమ్ ఆద్మీ పార్టీ ఎద్దేవా చేసింది. సెంట్రల్ విస్టా ప్రాజెక్టులో భాగంగా కొత్త పార్లమెంట్ భవనాన్ని 2023 మే 28న ప్రధాని మోదీ ప్రారంభించారు. కాగా, పైకప్పు గ్లాస్ డోమ్‌లకు ఏర్పాటుచేసిన పట్టీలు వదులుగా ఉండటంతో కొత్త పార్లమెంటు భవనం మకర ద్వారం వద్ద స్వల్పంగా నీరు లీకైందని లోక్‌సభ సెక్రటేరియట్ తెలిపింది. సకాలంలో సమస్యను గుర్తించి, వెంటనే మరమ్మతులు చేపట్టామని, అంతటితో నీరు కారడం ఆగిపోయిందని కేంద్ర ప్రభుత్వం వివరణ ఇచ్చింది.



## ఉపాధ్యాయురాలి రిలీవ్‌పై రభస

● కుభీర్ ఎంఈవో ఇంటి ఎదుట ఉపాధ్యాయురాలి ఆందోళన

● ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసిన ఎంఈవో చంద్రకాంత్

భైంసా, ఆగస్టు1: కుభీర్ మండలంలోని బెల్గాం ప్రభుత్వ పాఠశాల నుంచి బదిలీ అయిన ఉపాధ్యాయురాలు దేవకి రిలీవ్ విషయంలో గురువారం భైంసాలో రభస చోటుచేసుకుంది. రిలీవ్ చేసే ప్రక్రియలో కుభీర్ ఎంఈవో చంద్రకాంత్ అనుసరిస్తున్న తీరును నిరసిస్తూ బదిలీ అయిన ఉపాధ్యాయురాలికి మద్దతుగా యూటీఎఫ్ నిర్మల్ జిల్లా కార్యదర్శి రవికిరణ్ ఆందోళన చేపట్టాడు. ఉపాధ్యాయురాలు దేవకి యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి రవి కిరణ్‌లు భైంసాలోని పులేనగర్ కాలనీ పరిధిలో నివాసం ఉంటున్న కుభీర్ ఎంఈవో చంద్రకాంత్ ఇంటి ఎ దుట ఆందోళన చేశారు. రిలీవ్ చేయడంలో జాప్యం ఎందుకు చేస్తున్నారని ఎంఈవోతో రవికిరణ్ తీవ్రస్థాయిలో వాగ్వాదానికి దిగాడు. ల ంచంగా అడిగిన డబ్బులు ఇవ్వకుంటే రిలీవ్ చేయవా!? అని మండిపడ్డారు. దీంతో కంగుతిన్న ఎంఈవో చంద్రకాంత్.. తన ఇంటికి వచ్చి కుటుంబీకుల ముందు ఇలా వ్యవహరించడం ఎంతవరకు సబబు అని ప్రశ్నించారు. ఆ తర్వాత ఎంఈవో అక్కడి నుంచి వెళ్లేందుకు ప్రయత్నించగా.. కారును ముందుకు పోనీయకుండా యూటీఎఫ్ నేత రవికిరణ్ అడ్డుకున్నారు. రిలీవ్ చేసే విషయంలో స్పష్టత ఇచ్చేంతవరకు ఎక్కడికి వెళ్లనీయబోనని తేల్చిచెప్పాడు. ఆ తర్వాత జరిగిన ఘటనపై ఎంఈవో చంద్రకాంత్ భైంసా పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. బదిలీ అయిన ఉపాధ్యాయులను రిలీవ్ చేసే విషయంలో ప్రభుత్వ నిబంధనల ప్రకారం వ్యవహరిస్తున్న తనపై యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి రవి కిరణ్, ఉపాధ్యాయురాలు దేవికలు దూషణల పర్వానికి పాల్పడ్డారని ఫిర్యాదు చేశారు. తన ఇంటి వద్ద గలాటా చేసిన వారిద్దరిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

### 'గ్రామ పోలీసు వ్యవస్థను పటిష్టం చేయాలి'

ఇంద్రవెల్లి, ఆగస్టు1: గ్రామపోలీస్ వ్యవస్థను పటిష్టం చేయడంతో గ్రామాల్లో చాలావరకు నేరాలను నియంత్రించవచ్చని, ముందుగానే నేరాలను గుర్తించి అదుపుచేయవచ్చని ఉట్నూర్ డీఎస్పీ నాగేందర్ గౌడ్ అన్నారు. మండలకేంద్రంలోని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో గురువారం ఆయన సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలను ఎప్పటికప్పుడు పోలీసులు సందర్శించి ప్రజలతో సత్సంబంధాలను ఏర్పాటు చేసుకోవడంతో నేరాలను నియంత్రించే అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఉట్నూర్ సీఐ మొగిలి, ఎస్సై దుబ్బాక సునీల్, ఏఎస్సై భీంరావు ఉన్నారు.

### 'ఎమ్మెల్యేపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించం'

ఉట్నూర్, ఆగస్టు1: ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మబొజ్జుపటేల్‌పై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదని జిల్లా కాంగ్రెస్ కమిటీ వర్కింగ్ ప్రెసిడెంట్ లింగంపల్లి చంద్రయ్య హెచ్చరించారు. గురువారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఎమ్మెల్యేకు ఆర్థికమంత్రి ఎవరో తెలియదా అని ఉట్నూర్ సామాజిక మాధ్యమాలలో ఇష్టం వచ్చినట్టు ట్రోలింగ్‌చేసిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యేను రాజకీయంగా ఎదుర్కొలేక ముందు నిలబడి మాట్లాడలేని వారు వెనుకఉండి ఓ దళితుడిని ముందుంచి సామాజిక మాధ్యమంలో పెట్టించారని ఆరోపించారు.

### 'రైతులకు పూర్తిస్థాయిలో రుణమాఫీ చేయాలి'

గుడిహత్నూర్, ఆగస్టు1: రైతులకు పూర్తిస్థాయి రుణమాఫీ కాకపోవడంతో రైతులు, బీజేపీ నాయకులు గురువారం బ్యాంకు ఆఫ్ మహారాష్ట్ర ముందు ధర్నాచేపట్టారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు పతంగే బ్రహ్మానంద్ మాట్లాడుతూ బ్యాంకు అధికారుల నిర్లక్ష్యంతో రైతులకు పూర్తిస్థాయిలో రుణమాఫీ కాలేదన్నారు. బ్యాంకు అధికారులు వెంటనే పూర్తిస్థాయిలో రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. ఆగస్టు 15 లోగా ప్రభుత్వం చేసిన రుణమాఫీ వివరాలు రైతులకు అందజేయకపోతే పెద్దఎత్తున ధర్నా చేపడతామని హెచ్చరించారు. బ్యాంకులో బ్రోకర్ దళారీ వ్యవస్థ నిర్మూలించాలన్నారు. ఎలాంటి సంఘటనలు తలెత్తకుండా ఇచ్చోడ సీఐ భీమేష్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటుచేశారు. తహసీల్దార్ కవితారెడ్డి బ్యాంకు అధికారులతో మాట్లాడారు. బ్యాంకు సిబ్బంది ఉన్నత అధికారులకు సమస్యను వివరించారు. సమస్య పరిష్కరిస్తామని చెప్పడంతో ధర్నా విరమించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు కేంద్రే శివాజీ, మాజీ వైస్ ఎంపీపీ భరత్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

### ఎస్సీ వర్గీకరణపై సుప్రీం తీర్పు హర్షనీయం

నిర్మల్ కల్చరల్, ఆగస్టు 1 : ఎస్సీ, ఎస్టీ వర్గీకరణపై సుప్రీం కోర్టు తీర్పు హర్షనీయమని మాజీ కేంద్ర మంత్రి వేణుగోపాలచారి ఒక ప్రకటనలో తెలిపారు. 30 సంవత్సరాలు సుదీర్ఘ పోరాటానికి న్యాయం లభించిందని పేర్కొన్నారు. ఉప కులాలకు, అట్టడుగు వర్గాలకు ప్రయోజనం కలుగుతుంది. ఇందుకు సంబంధించిన మార్గదర్శకాలు రూపొందించి వారికి అవకాశాలు కల్పించాలని కోరారు. ఐదుగురు న్యాయమూర్తుల తీర్పు స్వాగతిస్తున్నామని తెలిపారు.

● తీర్పు చారిత్రాత్మకం

ఎస్సీ, ఎస్టీ వర్గీకరణపై సుప్రీం ధర్మాసనం ఇచ్చిన తీర్పు చారిత్రక నిర్ణయమని మాజీ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. బుధవారం విడుదల చేసిన ప్రకటనలో ఉప వర్గీకరణ చేసే అధికారం రాష్ట్రాలకు ఇవ్వడం హర్షణీయమని పేర్కొన్నారు. పేదలకు న్యాయం జరగాలన్నదే కాంగ్రెస్ అభిమతం అన్నారు. దళితుల చిరకాల కల నెరవేరనుందని అన్నారు. మందకృష్ణ మాదిగ మూడు దశాబ్ద కృషి ఫలించిందని తెలిపారు.

### 'మహిళా ఎమ్మెల్యేలపై సీఎం అనుచిత వ్యాఖ్యలు సరికాదు'

ఖానాపూర్, ఆగస్టు1: మహిళా ఎమ్మెల్యేలపై సీఎం రేవంత్‌రెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని బీఆర్ఎస్ ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి భూక్యా జాన్సన్‌నాయక్ అన్నారు. బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యే లపై సీఎం వ్యాఖ్యలకు వ్యతిరేకంగా గురువారం ఖానాపూర్‌లో బీఆర్ఎస్ శ్రేణులు నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జాన్సన్ నాయక్ నివాసం నుండి స్థానిక తెలంగాణచౌక్ వరకు బీఆర్ఎస్ నాయకులు బైక్ ర్యాలీ నిర్వహించి తెలంగాణ తల్లి విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. అనంతరం జాన్సన్ నాయక్ మాట్లాడుతూ... తమ పార్టీ ఎమ్మెల్యేలు సబితా ఇంద్రారెడ్డి, సునీత లక్ష్మారెడ్డిలపై సీఎం రేవంత్ రెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన వ్యాఖ్యలను ఉపసంహరించుకొని మహిళా ఎమ్మెల్యేలకు బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలను అసెంబ్లీ వేదికగా ప్రశ్నించేందుకే తమ పార్టీ మహిళా ఎమ్మెల్యేలను సీఎం టార్గెట్ చేశారన్నారు. ఇప్పటికే కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత పెరిగిందని ఇలాంటి విధానాలను అనుసరిస్తే ప్రజలు కాంగ్రెస్‌ను మరింత ఈసడించుకోవడం ఖాయమన్నారు.

# నల్లగల్మపై చిన్నచూపు


సదర్మాట్ కెనాల్ నుంచి సాగునీటిని అందించే నల్లగల్మ తూము ఇదే


పిచ్చిమొక్కలు మట్టి, నిర్మాణాలతో కుంచించుకు పోయిన నల్లగల్మ కాలువ


పడావుగా మారిన వ్యవసాయ భూములు

- తలాపున నీళ్లున్నా.. పదేళ్లుగా పడావుగానే పంట చేళ్లు
- అధికారుల పట్టింపు కరువై కూరుకుపోయిన నల్లగల్మ పంట కాలువ
- కాలువ నీరు రాకపోవడంతో పడావుగా మారుతున్న 60 ఎకరాలకు పైగా వ్యవసాయ భూములు
- ఎన్నిసార్లు కలిసినా అధికారులు పట్టించుకోవడం లేదని లింగాపూర్, సారంగాపూర్ గ్రామస్థుల ఆవేదన
- తిరిగి ఉపయోగంలోకి తేవాలని రెండు గ్రామాల రైతుల వినతి

ఖానాపూర్, ఆగస్టు 1 : ఖానాపూర్, కడెం మండలాలకు జీవనాధారంగా పేరుగాంచిన సదర్మాట్ సాగునీటి కాలువ ద్వారా ఆయకట్టు చివరి వరకు నీటిని అందించేందుకు తెలంగాణ ప్రభుత్వం చేస్తున్న కృషిని అధికారుల నిర్లక్ష్యం నీరుగారుస్తోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. సదర్మాట్ ప్రధాన కాలువ నుంచి పంట చేలకు వెళ్లే పిల్ల కాలువలను అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. గత కొద్దిరోజుల క్రితం ఓ అధికారి నీటి విడుదల కోసం డబ్బులు వసూలు చేస్తున్నారని రైతులు నేరుగా రోడ్డెక్కి ఆందోళనలు సైతం చేశారు. ఇప్పుడు సదర్మాట్ నల్లగల్మ విషయంలో ఎన్నిసార్లు చెప్పిన అధికారులు పట్టించుకోవడం లేదంటే దాని వెను అంతర్యం ఏంటో అర్థం కావడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రధాన కాలువకు నీటిని విడుదల చేసినప్పటికీ ఆ కాలువ నుంచి పంట చేలకు వెళ్లే పిల్ల కాలువలలో పూడికలు తీయకపోవడంతో ఎక్కడికక్కడ కాలువలు మట్టితో, ముళ్ల పొదలతో, పిచ్చిమొక్కలతో కూరుకుపోయాయని ఈ ప్రాంత రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఖానాపూర్ మండలంలోని మేడంపల్లి అడవుల్లో గోదావరినదిపై అప్పటి ఫ్రెంచ్ ఇంజనీర్ జై జై వొటాలేచే నిర్మితమైన సదర్మాట్ ఆనకట్ట నుంచి ఖానాపూర్ కడెం మండలాలకు సాగు నీటి కాలువలు ఉన్నాయి. పెద్ద కాలువగా పిలబడే సదర్మాట్ కెనాల్ నుంచి రెండు మండలాలలో సుమారు 14 వేల ఎకరాల కొరకు సాగు నీటిని అందించేందుకు ఎన్నో రకాల పిల్ల కాలువలు ఉన్నాయి. వాటిని ఆయా రకాల పేర్లతో ఇక్కడి అధికారులు రైతులు పిలుస్తుంటారు. కడెం మండలం లింగాపూర్ సమీపంలో పెద్ద కాలువ నుండి లింగాపూర్, సారంగాపూర్ గ్రామాలకు సాగునీటిని అందించే నల్లగల్మ అని పిలవబడే పిల్లకాలువపై అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని ఈ ప్రాంత రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### తలాపున నీళ్లు ఉన్నా.. పదేళ్లుగా పడావుగా పంట చేలు

తలాపున నీళ్లు ఉన్నా.. పదేళ్లుగా పంట చేలు పడావుగా ఉండాల్సిన పరిస్థితి తలెత్తిందని కడెం మండలంలోని లింగాపూర్, సారంగాపూర్ గ్రామాల రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. లింగాపూర్‌ను ఆనుకుని సదర్మాట్ కెనాల్ ప్రవహిస్తున్నప్పటికీ నల్లగల్మకు నీళ్లు రావడం లేదని రైతులు చెబుతున్నారు. గత పదేళ్ల క్రితం వరకు నల్లగల్మ నిండుగా ప్రవహించి లింగాపూర్, సారంగాపూర్ గ్రామాల పరిధిలోని సుమారు 65 నుంచి 70 ఎకరాల వ్యవసాయ భూములకు సాగునీటిని అందించేదని ఈ ప్రాంత రైతులు చెబుతున్నారు. గత పదేళ్లుగా నల్లగల్మ పూర్తిగా కూరుకుపోవడంతో త్రాగునీరు రావడం లేదంటున్నారు. గత ప్రభుత్వ హయాంలో ఎన్నోసార్లు అధికారులను కలిసి విన్నవించుకున్న నల్లగల్మ మరమ్మతులకు నోచుకోలేదన్నారు. ఈ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కూడా నల్లగల్మ దుస్థితిపై స్థానిక ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు దృష్టికి తీసుకెళ్లామన్నారు. ఎమ్మెల్యే స్పందించి వెంటనే నల్లగల్మకు మరమ్మతులు నిర్వహించాలని, పూడికను తీయాలని అధికారులను ఆదేశించినప్పటికీ అధికారులు మాత్రం స్పందించడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా పనులు చేయించుకోవాలని తాము పూడిక తీయమని సదర్మాట్ ఉన్నతాధికారులకు చెబుతున్నారని, పంచాయతీరాజ్ అధికారులేమో ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా నల్లగల్మ పూడికతీత పనులు నిర్వహించలేమని రాతపూర్వకంగా రాసిచ్చారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీరాజ్, అధికారులు ఇచ్చిన లెటర్‌ను సదర్మాట్ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ వారి నుంచి స్పందన లేదని రైతులు చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నల్లగల్మను తిరిగి ఉపయోగంలోకి తెచ్చి లింగాపూర్, సారంగాపూర్ గ్రామాల్లో పడావుగా మారుతున్న వ్యవసాయ భూములను తిరిగి సాగులోకి తేవాలని కోరుతున్నారు.

### భూములన్నీ పడావుగా మారుతున్నాయి



నల్లగల్మకు పదేళ్ల నుంచి నీళ్లు రావడం లేదు. దీంతో కొంతమంది వ్యవ సాయ బావులు తవ్వుకున్నారు. మిగతా భూములన్నీ పడావుగా మారు తున్నాయి. కాల్వ పూడిక తీసి నీళ్లు వచ్చేలా చర్యలు చేపట్టాలి.

- అడ్వాల భీమలింగు, రైతు సారంగాపూర్

### ఎన్నిసార్లు చెప్పినా అధికారులు స్పందించడం లేదు



నల్లగల్మను ఉపయోగంలోకి తేవాలని గత ప్రభుత్వ హయాంలోనూ అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సైతం అధికారులను కలిసి నల్లగల్మను ఉపయోగంలోకి తెచ్చేలా చర్యలు చేపట్టాలని కోరినప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదు. వెంటనే నల్లగల్మ పూడికతీత పనులు నిర్వహించి శాశ్వత నిర్మాణం చేయాలి.

- గాండ్ల శ్రీనివాస్, రైతు, లింగాపూర్

### మరమ్మతులకు ప్రతిపాదనలు పంపించాం

నల్లగల్మ పూడికతీత కోసం ఉన్నతా ధికారులకు ప్రతిపాదనలు పంపించాం. ఇందుకు గాను రూ.1.84 లక్షల నిధులు అవసరమవుతాయని అంచనా వేసి ఉన్నతాధి కారుల దృష్టికి తీసు కెళ్లాం. నిధులు మంజూరు అయితే పనులు చేప డతాం.

- భోజదాస్, డీఈఈ, సదర్మాట్


ముళ్లపొదలతో నిండిన నల్లగల్మ కాలువ

మహిళా ప్రజాప్రతినిధులను అవమానించిన

## సీఎం రేవంత్‌రెడ్డి క్షమాపణ చెప్పాలి

- జిల్లా కేంద్రంలో బీఆర్ఎస్ శ్రేణుల నిరసన


సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న దృశ్యం

నిర్మల్ అర్బన్, ఆగస్టు 1 : అసెంబ్లీ సాక్షిగా బీఆర్ఎస్ పార్టీకి చెందిన మహిళా ప్రజాప్రతినిధులపై అనుచిత వ్యాఖ్యలు చేసిన సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కలు వెంటనే క్షమాపణ చెప్పాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు నిర్మల్‌లోని ఆర్డీవో కార్యాలయం ఎదురుగా గురువారం ఆ పార్టీ నాయకులు నిరసనకు దిగారు. సీఎం రేవంత్ రెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ఆయన దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా పార్టీ పట్టణ అధ్యక్షులు మారుగొండ రాము మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డికి కనీసం మహిళలను గౌరవించే సంస్కారం కూడా లేదని విమర్శించారు. ఈ నిరసనలో జడ్పీ కోప్షన్ సభ్యులు డాక్టర్ సుభాష్‌రావు, నిర్మల్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పూదరి నరహరి, బీఆర్ఎస్ పార్టీ మైనార్టీ సెల్ రాష్ట్ర నాయకులు నజీర్ ఖాన్, బీఆర్ఎస్ నాయకులు అక్రమ్, అబీబ్ పాల్గొన్నారు.

తెల్లరేషన్ కార్డు ఉన్న ప్రతీ ఒక్కరూ

## లేబర్ ఇన్సూరెన్స్‌ను సద్వినియోగం చేసుకోండి

- బీజేపీ చేరికల కమిటీ జిల్లా చైర్మన్ భూపతిరెడ్డి

నిర్మల్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : తెల్లరేషన్ కార్డు ఉన్న ప్రతీఒక్కరూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన లేబర్ ఇన్సూరెన్స్‌ను సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ చేరికల కమిటీ జిల్లా చైర్మన్ భూపతిరెడ్డి అన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఈ పథకానికి ప్రభుత్వ ఉద్యోగులు తప్ప అన్ని విభాగాలతో పనిచేస్తున్న వారు అర్హులేనన్నారు. ఈ పథకంలో చేరేవారు ఏడాదికి రూ.22 చొప్పున 5 సంవత్సరాలకు రూ.110 ఒకేసారి చెల్లించాలన్నారు. ఈ పథకంలో చేరేందుకు 18 నుంచి 55 సంవత్సరాలు ఉన్న స్త్రీ, పురుషులు అర్హులన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు తప్ప ఎలాంటి కూలీలైన, ఇతరులైన ఇందులో చేరవచ్చునని తెలిపారు.

## రైతు రుణమాఫీ చరిత్రలో నిలిచిపోతుంది


దీపాదాస్ మున్షీతో మాట్లాడుతున్న నారాయణరావ్

భైంసా, ఆగస్టు 1 : ఒకే పంట కాలంలో రాష్ట్ర ప్రభుత్వం రూ.2 లక్షల రైతు రుణమాఫీ చేపట్టడం దేశ చరిత్రలోనే నిలిచిపోతుందని ముథోల్ మాజీ ఎమ్మెల్యే బోస్లే నారాయణ రావ్ పాటిల్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జీ దీపా దాస్ మున్షీతో పేర్కొన్నారు. గురువారం హైదరాబాద్‌లో మాజీ ఎమ్మెల్యే పాటిల్ పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జీ దీపా దాస్ మున్షీని రేవంత్ రెడ్డి సర్కార్ రైతు రుణమాఫీ చేపట్టిన సందర్భంగా మర్యాదపూర్వకంగా కలిసి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా వారిరువురు ముథోల్ నియోజక వర్గ పరిధిలో కాంగ్రెస్ పార్టీ స్థితిగతులు, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల విషయంలో చర్చించినట్లుగా సమాచారం.

### ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలి

ఖానాపూర్, ఆగస్టు 1 : ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని సీపీఐ ఎంఎల్ మాస్ లైన్ ప్రజాపంథా ఉమ్మడి జిల్లా కార్యదర్శి నంది రామయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ఆ పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా ఖానాపూర్‌లో ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక విశ్రాంతి భవనం నుండి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు.

## అప్పుల బాధతో ఒకరి ఆత్మహత్య


గంగాధర్ మృతదేహం

ఖానాపూర్, ఆగస్టు 1 : అప్పులబాధ భరించలేక ఒకరు ఆత్మహత్య చేసుకున్న ఘటన గురువారం ఖానాపూర్‌లో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే ఖానాపూర్ ఎస్సై లింబాద్రి తెలిపిన కథనం ప్రకారం.. ఖానాపూర్ విద్యానగర్ కాలనీకి చెందిన బెజ్జారపు గంగాధర్(48) అనే వ్యక్తి స్వర్ణకారుడిగా పనిచేస్తున్నాడు. కాగా అతనికి గత కొద్దిరోజులుగా అప్పులు ఎక్కువ అవ్వడంతో బుధవారం సాయంత్రం 7:30 గంటల ప్రాంతంలో తనషాపులో ఉపయోగించే యాసిడ్‌ని తాగాడు. అతనిని వెంటనే కుటుంబ సభ్యులు ఖానాపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అక్కడి నుండి ఉన్నత వైద్యం కోసం హైదరాబాద్ గాంధీ ఆసుపత్రికి తరలించారు. గాంధీ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం ఉదయం మృతి చెందాడు. గంగాధర్ తల్లి పద్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు. కాగా మృతి చెందిన గంగాధర్ వారి కుల సంఘం తాలూకు వాట్సాప్‌గ్రూప్‌లో తాను చనిపోతున్నానని మెసేజ్‌లు చేసినట్లు ప్రచారం జరుగుతోంది. అందులో ఎవరి కారణంగా చనిపోతున్నాడో చెబుతూ వాయిస్ రికార్డులు పోస్ట్ చేశారని చెబుతున్నారు. ఈ విషయమై ఎస్సై లింబాద్రిని ఆంధ్రజ్యోతి వివరణ కోరగా గంగాధర్ ఫోన్‌ను సీజ్ చేశామని అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తామన్నారు. గంగాధర్‌కు భార్య, ముగ్గురు కూతుళ్లు ఉన్నారు.

## మీ వేధింపులు తాళలేం.. మీ వద్ద ఉద్యోగం చేయలేం

- కడెం తహసీల్దార్‌కు కార్యాలయ సిబ్బంది సామూహిక సెలవుపత్రం
- తహసీల్దార్ వైఖరికి నిరసనగా మూడు రోజులపాటు సామూహిక సెలవులపై డీటీ సహా 13 మంది సిబ్బంది


సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది

ఖానాపూర్, ఆగస్టు 1 : మీ వేధింపులు తాళలేకపోతున్నాం.. ఇకపై మీ వద్ద ఉద్యోగం చేయలేం అంటూ... కడెం తహసీల్దార్ సుజాతరెడ్డికి గురువారం డిప్యూటీ తహసీల్దార్ శంకర్ సహా ఆ కార్యాలయ 13 మంది సిబ్బంది సామూహిక సెలవుపత్రాన్ని అందజేశారు. అనంతరం కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ తహసీల్దార్ శంకర్, సీనియర్ అసిస్టెంట్ నాగోరావులు మాట్లాడుతూ... గత ఆరు నెలలుగా తహసీల్దార్ సుజాతరెడ్డి సిబ్బందిని తీవ్రంగా ఇబ్బంది పెడుతున్నారన్నారు. ఇష్టారాజ్యంగా దూషిస్తూ అవమాన పరుస్తున్నారన్నారు. ఇన్నాళ్లుగా తమపై అధికారి అని గౌరవిస్తూ వచ్చామని అయినా ఆమెలో మార్పు రాకపోవడంతో నిరసనగా మూడు రోజులపాటు సామూహికంగా సెలవులపై వెళ్లాలని నిర్ణయించుకున్నట్లు పేర్కొన్నారు. ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి సైతం తీసుకెళ్లామని కార్యాలయ సిబ్బంది తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐలు తక్కన్న, లక్ష్మణ్, సీనియర్ అసిస్టెంట్ నాగోరావు, జూనియర్ అసిస్టెంట్లు కవిత, ప్రిస్కిళ్ల, లావణ్య, మండల సర్వేయర్ ఉమాజీ, సిబ్బంది, తదితరులున్నారు.

### విచారణ జరిపి చర్యలు చేపడతాం : నిర్మల్ ఆర్డీవో రత్నకల్యాణి

కడెం తహసీల్దార్ కార్యాలయంలో సిబ్బంది సామూహిక సెలవులపై వెళ్లిన విషయం నా దృష్టికి రాలేదు. జరిగిన ఘటనపై విచారణ జరిపి చర్యలు తీసుకుంటాం.

## గోదావరిలో దూకి గుర్తుతెలియని మహిళ ఆత్మహత్య



బాసర, ఆగస్టు, 1 : బాసర వద్ద గోదావరి నదిలో దూకి గురువారం గుర్తు తెలియని మహిళ ఒకరు ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గురువారం సాయంత్రం ఓ మహిళ స్నాన ఘట్టాల వద్ద నుంచి నదిలోకి వెళ్లి ఆత్మహత్య చేసుకుంది. స్థానికులు కాపాడే ప్రయత్నం చేసినప్పటికి నదిలో నీటి ప్రవాహం ఎక్కువగా ఉండడంతో రక్షణ చర్యలకు ఆటంకంగా మారింది. దీంతో మహిళ ప్రాణాలను అక్కడున్న వారు కాపాడలేకపోయారు. నీటి ప్రవాహం ఎక్కువగా ఉండడంతో మృతదేహం వెంటనే నది ఒడ్డున చేరింది. మృతురాలి వద్ద ఆమె చిరునామకు సంబంధించి ఎలాంటి సమాచారం లభించలేదని పోలీసులు తెలిపారు. సంఘటన స్థలం వద్ద దొరికిన మెట్రోస్టేషన్ కార్డు, పిస్తాహౌజ్ బేకరీ కవర్, హ్యాండ్ బ్యాగ్ ఉండడంతో మృతురాలు హైదరాబాద్‌కు చెందినవారై ఉంటారని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటనపై కేసు నమోద చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## స్వచ్ఛదనం.. పచ్చదనం కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలి

- రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి


వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా కలెక్టర్

నిర్మల్ అర్బన్, ఆగస్టు 1 : స్వచ్ఛదనం.. పచ్చదనం కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్రప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి అధికారులను ఆదేశించారు. గురువారం సాయంత్రం హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా స్వచ్ఛ దనం - పచ్చదనం కార్యక్రమ అమలుపై ఆమె అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ... ఈ నెల 5 నుండి 9వ తేదీ వరకు గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో స్వచ్ఛదనం - పచ్చదనం కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. రోజువారీ ప్రణాళిక ప్రకారం వివిధ కార్యకలాపాలను చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమాల ద్వారా ప్రజల్లో స్వచ్ఛత, పరిశుభ్రత, మొక్కల పెంపకం వంటి విషయాలపై విస్తృతంగా అవగాహన కల్పించాలని ఆదేశించారు. స్థానిక ప్రజాప్రతినిధులు, మహిళా స్వయం సంఘాల సభ్యులు, యువకులను సభ్యులుగా చేసి, క్షేత్రస్థాయిలో కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కలిగేలా ర్యాలీలు నిర్వహించాలని సూచించారు. విద్యాసంస్థలు, ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ స్థలాల్లో విరివిగా మొక్కలు నాటాలన్నారు. ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నిషేధించాలని, ప్లాస్టిక్ వల్ల కలిగే అనర్థాలను తెలియజేసే విధంగా గోడలకు పెయింటింగ్స్ వేయించాలని, వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాలలో పారిశుద్ధ్యం నిర్వహించడం, నీటి శుభ్రత వంటి విషయాలపై రోజువారీ కార్యాచరణలో భాగంగా ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. మరుగుదొడ్లు లేని ఇళ్లను గుర్తించి నిర్మాణానికి 15 రోజుల్లో అనుమతులు ఇవ్వాలని ఆదేశించారు. ప్రజల భాగస్వామ్యంతో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అధికారులకు సూచించారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ మాట్లాడుతూ... స్వచ్ఛదనం.. పచ్చదనం కార్యక్రమం విజయవంతానికి పటిష్టచర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రోజువారీ ప్రణాళికల అమలుకు అధికారులంతా సిద్ధంగా ఉండాలన్నారు. జిల్లాలో స్వచ్ఛ దనం - పచ్చదనం కార్యక్రమంలో భాగంగా విస్తృతస్థాయిలో మొక్కలు నాటేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో నిరంతరం పారిశుద్ధ్యం పనులను కొనసాగించాలన్నారు. ప్రజలందరినీ కార్యక్రమంలో భాగస్వామ్యం చేయాలని తెలిపారు. వర్షాలు కురుస్తున్నందున నీరునిల్వ ఉండే ప్రదేశాలలో ఆయిల్ బాల్స్, బ్లీచింగ్ పౌడర్‌ను వేయాలన్నారు. దోమలను పెరగకుండా నియంత్రించి, కాలానుగుణ వ్యాధులు ప్రబలకుండా అన్ని రకాల చర్యలు తీసుకోవాలన్నారు. స్వచ్ఛదనం.. పచ్చదనం కార్యక్రమంపై విద్యార్థులకు ప్రజలకు అవగాహన పెంచేలా విద్యార్థులచే వ్యాసరచన పోటీలను నిర్వహించాలన్నారు. ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలచే కాలానుగుణ వ్యాధుల నియంత్రణ, నివారణ చర్యలపై గ్రామాల్లో అవగాహన కల్పించాలన్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో శిథిలావస్థకు చేరిన భవనాలను గుర్తించి వారిని ఖాళీ చేయించాలన్నారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, జడ్పీ సీఈవో గోవింద్, చీఫ్ ప్లానింగ్ అధికారి బాబు రావు, డీఆర్డీవో విజయలక్ష్మి, జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ సందీప్, మున్సిపల్ శాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## గంజాయి రవాణా, విక్రయాలపై గట్టి నిఘా పెట్టాలి : ఎస్పీ



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ

నిర్మల్ కల్చరల్, ఆగస్టు 1 : జిల్లాలో గంజాయి రవాణా, విక్రయాలపై గట్టి నిఘా పెట్టాలని నేరస్థులకు న్యాయస్థానంలో శిక్షపడేలా చర్యలు తీసుకోవాలని ఎస్పీ జానకి షర్మిల అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లాలోని ఏఎస్పీ, డీఎస్పీ, సీఐలతో స్టేషన్‌ల వారీగా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... విచారణలో ఉన్న, గ్రేవ్ విచారణలో దీర్ఘకాల పెండింగ్‌లో ఉన్న కేసుల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. ఎస్సీ, ఎస్టీ కేసుల పరిష్కారం, ఎన్‌డీపీఎస్ యాక్ట్ కేసులు, ఎస్‌హెచ్ఆర్‌సీ తదితర కేసుల అప్పీల్ మహిళా కమిషన్ కేసులపై అధికారుల ద్వారా సమాచారం సేకరించారు. కేసులను పారదర్శకంగా విచా రించాలని సూచించారు. ప్రతీఫైల్‌లో ప్లాన్ ఆఫ్ యాక్షన్ ప్రకారం సీడీ ఫైల్ పొందుపర్చాలన్నారు. నేరఛేదన కంటే నేర నివారణ ముఖ్యమని వివరించారు. గంజాయి, మత్తు పదార్థాల రవాణాకు, విక్రయాలకు పాల్పడే వారిపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. పొగాకు అమ్మకం జరిపే వారిపై కఠినంగా వ్యవహరించాలని, పీడీ యాక్ట్ క్రింద కేసులు నమోదు చేయాలన్నారు. పీడీఎస్ బియ్యం, గుడుంబా రవాణా, పేకాట, ఇసుక అక్రమ రవాణా తదితర వాటిపై దాడులు నిర్వహించి అరెస్ట్ చేయాలన్నారు. సామాన్లు, వారెంట్లు ఎగ్జిక్యూట్ చేయాలని, క్రైమ్ ఎగైనెస్ట్ ఉమెన్ కేసులు విచారణ త్వరగా పూర్తిచేసి కోర్టులో ఛార్జ్ షీట్ దాఖలు చేయాలన్నారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితుల ఫిర్యాదులపై వెంటనే స్పందించాలని, న్యాయం చేయాలని స్పష్టం చేశారు. పోలీస్ వ్యవస్థపై ప్రజలకు నమ్మకం, భరోసా కలిగేలా సేవలు అందించాలని ఆదేశించారు. పెట్రోలింగ్, బ్లూ కోల్ట్స్, వాహనాలతో అధికారులు, సిబ్బంది సంచరిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడం ప్రధాన లక్ష్యం అన్నారు. సంఘటనలు జరిగిన వెంటనే అక్కడికి చేరుకోవాలని, పరిస్థితులు అదుపులో ఉండేలా చూడాలన్నారు. ముఖ్యమైన ప్రదేశాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ప్రజావాణి దరఖాస్తులకు ప్రాధాన్యత ఇచ్చి పరిష్కరించాలని, గ్రేవ్, నాన్ గ్రేవ్ కేసులపై అనుసరించాల్సిన చర్యలను వివరించారు. వర్షాకాలంలో తీసుకోవలసిన చర్యలు, డ్రంక్ అండ్ డ్రైవ్, వాహనాల తనిఖీ, తదితర అంశాలపై దిశానిర్దేశం చేశారు. భైంసా ఏఎస్పీ అవినాష్ కుమార్, నిర్మల్ డీఎస్పీ గంగారెడ్డి, డీసీఆర్‌బీ, సీసీఎస్, ఎస్‌బీ ఇన్స్‌పెక్టర్లు, స్టేషన్ అధికారులు పాల్గొన్నారు.

## పోలీసు కార్యాలయంలో వన మహోత్సవం



నిర్మల్ కల్చరల్, ఆగస్టు 1 : జిల్లా పోలీసు కార్యాలయంలో గురువారం వన మహోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఎస్పీ జానకి షర్మిల, ఏఎస్పీ అవినాష్ కుమార్, డీఎస్పీ గంగారెడ్డి తదితరులు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ... మానవాళి మనుగడకు మొక్కలు అవసరమన్నారు. ఆహ్లాదంతో పాటు ఆరోగ్యానికి మొక్కలు దోహదం చేస్తాయన్నారు. ఇప్పటి వరకు జిల్లాలోని పోలీసు సిబ్బంది 1,42,000 మొక్కలు నాటారని తెలిపారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పచ్చదనం పెంచాలన్నారు. సీఐలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## సంక్షిప్త సమాచారం

### సెల్‌ఫోన్ చార్జర్ కేబుల్ నోట్లో పెట్టుకుని చిన్నారి మృతి


ఆరాధ్య మృతదేహం

ఖానాపూర్, ఆగస్టు 1 : సెల్‌ఫోన్ చార్జింగ్ కేబుల్ నోట్లో పెట్టుకుని షాక్‌తో ఏడాదిన్నర బాలిక మృతి చెందింది. ఈ సంఘటన కడెం మండలం కొత్త మద్దిపడగలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన కథనం ప్రకారం... కొత్త మద్దిపడగ గ్రామానికి చెందిన దుర్గం సుశీల రాజలింగు దంపతు లకు ఇరువురు కుమార్తెలున్నారు. చిన్న కుమార్తె ఆరాధ్య(18 నెలలు) గురువారం రాత్రి తల్లిదండ్రులు ఇంట్లోనే ఉన్న సమయంలో ఆడుకుంటూ వెళ్లి చార్జింగ్ కేబుల్‌ను పట్టుకొని నోట్లో పెట్టుకుంది. చార్జింగ్ కేబుల్‌కు స్విచ్ వేసి ఉండడంతో ఒక్కసారిగా షాక్ కొట్టడంతో అక్కడికక్కడే పాప స్పృహ కోల్పోయింది. దీంతో వెంట నే చిన్నారి ఆరాధ్యను తల్లిదండ్రులు ఇద్దరు ఖానాపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో ఆరాధ్యను పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. దీంతో క్షణం క్రితం వరకు తమ కళ్ల ఎదుట సందడిగా కదలాడిన తమ బిడ్డ విగతజీవిగా మారి మృతి ఒడిలోకి వెళ్లడాన్ని ఆ తల్లిదండ్రులు జీర్ణించుకోలేకపోయారు. ఆసుపత్రిలో తమ కూతురిని చూసి వారు రోధించిన తీరు అక్కడున్న వారిని కలచి వేసింది. ప్రస్తుత పరిస్థితుల్లో చార్జింగ్ కేబుల్స్, సెల్ ఫోన్లు చిన్నారులకు వీలైనంత దూరంగా ఉంచాలని పలువురు నిపుణులు సూచిస్తున్నారు. ఏమాత్రం అలసత్వం ప్రదర్శించిన భారీ మూల్యం చెల్లించక తప్పదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చిన్నారి ఆరాధ్య మృతి పట్ల సోషల్ మీడియా వేదికగా పలువురు దిగ్భ్రాంతిని వ్యక్తం చేస్తున్నారు.

### రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ముథోల్, ఆగస్టు 1 : మండలంలోని తరోడా గ్రామ సమీపాన గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం.. భైంసా పట్టణానికి చెందిన ఎల్లప్ప, సాగర్ అనే ఇద్దరు వ్యక్తులు ద్విచక్ర వాహనంపై ముథోల్ నుండి భైంసా వైపు వెళ్తుండగా రోడ్డు పనుల దృష్ట్యా రోడ్డుపై పెట్టిన ఇనుప డ్రమ్ముకు ఢీకొనటంతో కింద పడిపోయారు. స్థానికులు, వాహనచోదకులు గమనించి 108కు సమాచారం అందించారు. చికిత్స నిమిత్తం భైంసా ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఇదిలా ఉండగా రోడ్డు పనులు చేస్తున్న గుత్తేదారు పనులు జరిగే చోట రోడ్డు పైన స్పష్టంగా కనబడే విధంగా సూచిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని వాహనదారులు ఆరోపిస్తున్నారు.

### కుంటాలలో భారీ వర్షం

కుంటాల, ఆగస్టు, 1 : కుంటాల మండలంలో బుధవారం రాత్రి భారీ వర్షం కురిసింది. గత కొద్దిరోజుల నుంచి వర్షాలు కురుస్తున్నపటికి బుధవారం రాత్రి ఒక్కసారి భారీ వర్షం రావడంతో కల్లూర్ వాగు ఉప్పొంగి ప్రవహించింది.